# ప్రబుద్ధాంధ్ర

సంపుటము ౬ రాజమహేంద్రవరము ౧౧ ఏప్రిల్ ౧౯౩౫ ౪ వ సంచిక


## తెనుగురక్తం చచ్చబడిపోతూ వుంది


సుబ్రహ్మణ్యశాస్త్రి—సంపాదకుడు


"చిత్తంచిత్తం. వారొక్క కలంపోటుతో తమ రొక బ్రాహ్మణకుటుంబానికి యావజ్జీవమూ అన్నంపెట్టగలరు."

"అన్నం పెట్టినా సున్నం పెట్టినా జిల్లాబోర్డుప్రెసిడెంటుగారు. నావల్ల యేమవుతుంకీ?"

"పేరుమట్టుకు వారిదే-అంటే మనవిచేసుకుంటాను. ఒక సత్రం వుందంటే దానికి స్థాపించిన దాత వేరూ, అక్కడ కనిపెట్టుకొని వుండి, సదుపాయాలు చేసే గుమాస్తా వేరూను. ఆదాత ఆజ్ఞని శిరసావహించడం గుమాస్తా పని కాదా మహానుభావా?"

"నేను దాతను కానే!"

"తమరిలా సెల విస్తే నేనేం మనవి చేసుకోగలనూ! సబ్ కలెక్టరుగారి శిఫారసు అంగీకరించకుండా జిల్లాబోర్డు ప్రెసిడెంటు ఏచెరువు నీళ్లు తాగగలడూ!"

"అది పూర్వకాలపుమాట. అంటే అప్పుడేమున్నదీ ప్లీడరో ప్రెసిడెంటుగా వచ్చేవాడు. అధికార్లతో మెలామనులుకోవాలో వారికి బాగా తెలిసేది. ఇప్పటివాళ్లు—చాలామంది మాట సుమండీ. పెద్దనంతకమూ చిన్నవంతకమూ అని దఫేదారు నడిగి—"

"తమరే వుపక్రమించారు కనుక వినిపించుకుంటాను. మన ప్రెసిడెంటుగారు—పిత్రార్జితంచారూ? కేవలమూ—రాత్రీ పగలూ కూడా మొకమోట—"

"సాటిబ్రాహ్మణ్ణి పట్టుకుని అలా అంటూ వేమిటయ్యా?"

"సాటివాడు కనకనే మాకీ తిప్పలు. ఏనాయుడుగారో, యేచౌదరిగారో అయితే—"

"బ్రాహ్మణులు స్త్రీ...తా కనిపించేస్తున్నావే!"

"ఇందులో యుక్తం వుంది మహాప్రభూ!"

"అయితే సంగతంతా తెలిసే వుంది కదా, పోనీ, యేనాయకురాలినో పట్టుకోరాదూ!"

"తమవల్ల కాకపోతేగదా!"

"అయినా సులభంగా పని జరిగిపోయే ఉపాయం ఆలోచన యెందుకూ!"

"ఇంటెల్లపాదిమీ వొక నెల వస్తుందేనా యేదో సప్లయి—"

"జిల్లాబోర్డుప్రెసిడెంటు కయితే సప్లయిలు మహా బాగా చేస్తారు ప్రజలు"

"చిత్తంచిత్తం, నాది పొరపాటు. రేపీపాటికి—"

"ఏదో మాటవరసకి కంటే యిలా మొదలుపెట్టా వేమిటయ్యోయ్? ఈకాస్తశిఫారసుభాగ్యానికీ నేను లంచం పుచ్చుకుంటానుటయ్యా!"

"లంచమా? ఎన్నివేల గుండెలున్నాయి ధర్మరాజువంటి తమ సన్నిధిలో అలాంటిమాట అనడానికి నాకూ! అసలు తమకి లంచం యివ్వడానికి నాకు తాహతు యెక్కడ వుందా?......మాకింత అన్నంపెట్టినందుకు తమకి పుణ్యలోకాలు వొక తమరు వాసనైనా చూడరుగాని, అయినా యేపులుసులో కేనా పనికివస్తుంది వొక బుట్టెడు బెల్లం,—అన్నట్టు మరిచిపోయాను వొక చిన్న శేనపొట్లకం—"

"ఇవి, యిలా యిలాంటివి నాకు నచ్చవు. చేస్తానంటావా యేమిటి? పట్టమైనవాడవే"

"తమ అనుగ్రహముండటమే ధైర్యం—"

"మా పెద్దమ్మాయీ, అల్లుడూ పిల్లలూ వస్తున్నారు రెండురోజుల్లో. అసలు నేనే కొంటాను గానీ—"

"వద్దువద్దు. తెల్లవారేటప్పటికి నేను దాఖలుచేసుకుంటాను. నేనూ ఆడపిల్లలు గలవాణ్ణి. ఆడపిల్లలికీ పుట్టింటిఆశ యెంత వుంటుందో, వాళ్లకి తల్లిదండ్రులు పెట్టుపోత లెలా చూడాలో నాకూ తెలుసు. ఇంతకీ స్నానానికి తమ రింత అన్నంపెట్టించాటప్పుడు నేను తమ అమ్మాయిగారికి కాస్త వుప్పూ, కాఫీ—"

"అవునవును. బెల్లంమాట కేం గాని—వెధవబెల్లం మాయింటో యీగలు కూడా దానిమీద వాలవు. నువ్వు కాఫీ అంటే జ్ఞాపకం వచ్చింది, నీదగ్గర యీ మధ్యనే యీనిన ఆవుందిట కాదూ?"

"వుంది మహారాజా, వుంది. జ్ఞాపకం వచ్చింది కాదు. స్వయంగా తోలుకువస్తాను నేను"

"గోదానం చేసుకున్నా ననుకుంటావా యేమిటి?"

"రామరామా! దానం పట్టేదాకా తమ కేం!"

"బ్రాహ్మలకిస్తే యేపేరు పెట్టినా దానమే అవుతుంది; కాని మాకిచ్చింది—విన్నావూ? నజరాణా. ఇనాము. నజరానా అంటే అదే. సామాన్యులు దాన్నే నేమా నంటారు"

"చిత్తం, చిత్తం"

"అసలు మాకు ప్రతిగ్రహాధికారమే లేకుండా చేశారు కాదూ మీ బ్రాహ్మలూ?"

"అనకూడదు కానండి—పూర్వపువాళ్లు ముక్కుమూసుకుని కూర్చోడం తప్ప మరేమీ యెరగరు"

"కనకనే అప్పుడు దేశం బాగుండేది.......అవును గానీ—తెల్లవారితే ద్వారపూడినంతకీ జవాన్ని పంపానుకుంటున్నాను, మానెయ్య మంటావా యేమి?"

"ఇంకెందుకు మహాప్రభూ?"

"మాఅమ్మాయి యిక్కడ వున్నంతకాలమే—, కాదంటే వొంటిపూట పడిదాకానూ. తరవాత యీఆవు మాకక్కరలేదుసుమా"

"ఏదో శాస్త్రం చెప్పినతరవాయిగా వొట్టిపోయాక గుదిబండలాగ—నేను వచ్చి తోలుకుపోతాను కాదూ అన్నదాతా"

"సరే అయితేనూ. నువ్వు మాకు ఆవుని తోలిపెడితే యీకారణంవల్ల కూడా అది గోదానంలో చేరదు సుమా"

"అసలు తమకి సందేహం—"

"సందేహాని కేమీ లేదు గానీ—అసలు సందేహం యేమిటి గానీ—యింకోటి కూడా వుంది చూశావో లేదో గానీ"

ఏమిటండి!"

"నిజంగా అది దానమే అనిపించుకుంటే మళ్లీ నువ్వు తోలుకువెళ్లడం దత్తాపహారం అయిపోతుంది. నీకు ఆ పాపం చుట్టబెట్టుకోకుండా వుండడానికూడా దాన్ని దానంలో చేర్చడానికి వల్లకాదు. తెలిసిందా?"

"చిత్తంచిత్తం"

"సరే వెళ్లు.........రేపు పొద్దున్న కనబడతావు కాదూ?"

"కాకులు కూశాటప్పటికి వచ్చి లేవనూ తమర్నీ?"

"అదీ తెలివి. వెలుగు వచ్చిం దంటే దిక్కుమాలిన ప్రజలు—"

"ఒక పని చేస్తే?"

"ఏమిటది?"

"రాత్రి పన్నెండయ్యేటప్పటికి—"

"బాగుంది. మేము సినిమాకి వెళ్లి వచ్చేటప్పటికి తోలుకువస్తా నన్నమాట"

"చిత్తం"

"ప్రెసిడెంటుతో నేనీ సాయంత్రమే చెప్పి వుంచుతాను, తరవాత వుత్తరం పట్టుకువెడుదువుగాని"

"చిత్తం మహాప్రభూ!"

"మరివెళ్లు"

౨

"మణుగునెయ్యే!"

"మరి తప్పదు"

"తోపుకుని కూడా వచ్చారాయేమిటి!"

"లేకపోతే చావనా!"

"ఇంకేమీ లేవు కదా!"

"ఆ—వు—కూ—డా—"

"ఏమిటీ!"

"మన ఆవుని కూడా తోలిపెట్టాలి"

"కొంప ముంచారు"

"ఎలాగో సమాధానం చెప్పుకోవాలి. వుద్యోగం అంటే మాటలతో వుం దనుకున్నావా యేమిటి!" ఇంతకీ అది అబ్బాయికి అత్తవా రిచ్చిందే కదా!"

"మీకేమైనా మంచీ చెడ్డా వుందా లేదా!"

"ఏం!"

"మనమరాలికి పాలకోసం కదా వియ్యాలవారు దాన్ని తోలిపెట్టారు!"

"దానితండ్రికి నౌకరీ రావడానికి మనం తోలిపెట్టాలి"

"నలుగురూ గడ్డిపెట్టరూ!

"ఆయన అన్నం పెట్టడం లేదూ!"

"...................."

"...................."

"కాకపోయినా నాకేం! అది కోడలిది కదా! దాని యిష్టమూ, అబ్బాయి మనసూ, ఆపైని మీ అవసరమూనూ. మీచిత్తం వచ్చినట్టు చేసుకోండి"

"అబ్బాయే తోలుకువెడతాడు, మనకేం!"

"చంటిపిల్ల నోటిదగ్గిర పాలు పడగొట్టి—పిల్లలున్నారా ఆకలకేడుపు!"

"రెండు రోజుల్లో కూతురూ, అల్లుడూ మనమలూ వస్తారుట, వాళ్లకి కాఫీ—"

"కూతుళ్లు తండ్రేనా! నోరెలా వచ్చిందో!"

"అధికారం—అధికారం—వాళ్లకి నాగం దేమిటి!"

"చంటిపిల్ల—మూడుమాసాలగుడ్డు—దాని వుసురు తగలదూ ఆయుముడికీ!"

"మాట్లాడవద్దు, గప్ చిప్! నిప్పున్న కర్ర తగులడక మానదు. ఇక వూరుకో, పింఛను పుచ్చుకున్నాక వీళ్ల మొగం చూసేవా డెవ డింకా!"

"అనక ఆయన గతేమిటో కాని యిప్పుడు మన పిల్ల కడుపు మాడుతుంది. ఇక డబ్బాపాలు పొయ్యాలి"

"వొక్కనెల, వొక్కనెల వోపిక పట్టు. కోడలికి కూడా కష్టసుఖాలు బోధించు. ఆవూచీ అంతా అబ్బాయిదే కానీ—నెల తిరిగేటప్పటికి నలభైరూపాయలూ గల్లున చేతిలో పడతాయి. మొదటినెల జీతం రాగానే మాంచి కామధేనువులాంటి ఆవుని కొనేస్తాను అదిపెట్టే. రెండోనెల జీతంపెట్టి వొక్క బనారసు చీర—చూశావూ ? అది పచ్చని మనిషి కనక వూదారంగుది—జరీ పువ్వులుది కొని కట్టబెట్టా మంటే మొగం యింతవుతుంది దానికి. మూడోనెల జీతంతో బుల్లెమ్మకి బాలతొడుగు. దానితో దాని కడుపు కొట్టిన దోషం పోతుంది. తరవాత సంసారం వూటుగా—"

"అఘోరించినట్టే వుంది మీ కల్పన. చాల్లెండి ఇక వూరుకోండి. ఇదో ప్రజ్ఞగా యెక్కడా చెప్పకోకండి నలుగురూ లాటాకులు కడతారు"

"వాళ్ల మొహం. అబ్బాయికి వుద్యోగం అయిందంటే నేనిక యీవుండాకోరులతో మాట్లాడతానూ!

3

"......తమ రలా అంటే—"

"నేనన్న దేంవుందీ యిందులోనూ? అసలు సంగతి చెప్పాను. ఆపైని మీాయిష్టం"

"అలా కాదు. తమరు కోప్పడితే నేను ఆగలేను. బ్రాహ్మణ్ణి. బీదవాణ్ణి. కుటుంబీకుణ్ణి. తమరు కాస్త అనుగ్రహించాలి"

"వాకిట్లోకి రాగానే దర్శనం చెయ్యడానికి మీాకేమీా అడ్డులేదు......ఏం?"

"తమరు నాలికచివరనుంచి మాట్లాడితే—"

"మరి నువ్వు?"

"......................"

"వంగతోట దగ్గిర బావ కాదు కాబోలు"

"......కటాక్షించాలి"

"ఊ—హూ"

"అలా కాదు........."

"......లింగూలింగూ అయిదు రూపాయల కాగితం జేబులో పడేసి పర్యాశం లాక్కుపోతా నంటూ వేమిటయ్యా! వేమగాడవే"

"మహారాజులు కాదూ! ఇవి చేతులు కావు కాళ్లు. దరిద్రాణి. తానకం కాళ్ళు పట్టి తెచ్చానీ అయిదు రూపాయలూనూ. ఇక నన్ను కోసినా లేలేను. మమ్మల్ని రక్షించాలి"

"......అల్లాగే మీా బ్రాహ్మలకి చెల్లింది; కాని మాకు కాదు. లేవు—తెలిసిందా? ఉదయం తొమ్మిదిన్నరకి వస్తే వారు కాఫీపుచ్చుకునేటప్పుడు దర్శనం చేయిస్తాను. దానికి మాత్రం వొక రూపాయి తప్పదు సుమండీ"

"అడ్డోటు కూడానా?"

"అంతా వాడితోటే వుంది"

"ఇక తల తాకట్టు మిగిలింది. ఆరూపాయకోసం అది తాకట్టుపెడతాను. తప్పుతుంది మరి!"

"......కాని వున్న సంగతి చెబుతున్నాను నేను. మోసం చెయ్యడమూ దగా చెయ్యడమూ నావల్ల కాదు. ఇన్ని విధాల ప్రాధేయపడుతున్నారు కనక నామనస్సు వెన్నలాగ కరిగిపోతోంది...కరిగేపోయింది కూడానూ. మరి చెబుతాను వినండి"

"చెప్పండి"

"ప్రెసిడెంటుగారికి సబ్ కలెక్టరంటే యిష్టం లేదు"

"చచ్చాను......ఏం?"

"కారణం యేమయితే యేం? అది అలాగా. ఆవుత్తరం నాలిక గీసుకోడాని కేనా పనికిరాదు"

"కొంపగుల్ల—"

"అక్కడ యేమాత్రం?"

"రామరామా! బ్రాహ్మణపతుపాతి అండీ కలక్టరుగారూ. ఆశ్రయించాను. అనుగ్రహించారు"

"సరే, ఏంజరిగిందో జరిగింది కుంభకోణం. నా కిందు కానీ—చెప్పాను కాదూ? ఆవుత్తరానికీ తెల్లకాగితానికీ వొక్కటే విలవ"

"మరి గతేమిటి?"

"అనుమాన మైన దారి వుంది. కావలిస్తే చెబుతాను"

"సెలవివ్వండి"

"ఆవుపాయం చేశారంటే మీారు వారి దర్శనమే చెయ్యనక్కరలేదు. తెల్లవారేటప్పటికి ఆర్డరు చేతిలో పడుతుంది"

"అనుగ్రహించమన్నాను కాదూ?"

"అప్పుడు మాత్రం నాకింకో కాగితం—తెలిసిందా? "ఊ" అంటే గాని నేనిక చెప్పను"

"ఎక్కడ తేనూ?"

"మణుగునెయ్యి, బుట్టెడు బెల్లం, డబ్బా తేనెపనకం—"

"......తమ రేమిటేమిటో సెలవిస్తున్నారు. నాతల విలవ తెలుసుకుని తమ రేమన్నా—"

"నీతల విలవ అదే చెబుతుంది"

"......................"

"వులిక్కిపడతావేం?"

"....................."

"మాట్టాడవేమయ్యా?"

"అవుపాయం యేదో చెప్పండి"

"అలా దారిలోకి రా. తప్పకుండా యిస్తావు కాదూ! ......లేకపోతే మళ్లీ వెలుగు వచ్చాటప్పటికి అర్ధరుద్దు"

"....................."

"బాగా జ్ఞాపకం వుంచుకో. మరి విను; మొరక వీధి...... డా—బ్రా......అణిముత్యం — పేరెప్పుడేనా విన్నావా?"

"లేదు. ఎవరండి ఆయన?"

"ఆయన కాదు ఆవిడా. వేశ్య"

"........సరే, సెలవివ్వండి"

"అది చాలా అందమైనది. మాంచి ముమ్మరంలో వుంది. చూస్తే విడిచిపెట్టడం కష్టం. అప్పుడే నలుగురైదుగురు పకీరు లయిపోయారు—"

"వర్ణన అక్కర్లేదు. చెప్పండి"

"అది శిఫారసు చేస్తే పని జరుగుతుంది. మరి నీ తెలివి తేటలు వినియోగించుకో"

"వేదం చదువుకున్న వాణ్ణి—"

"నీకొడుక్కి కూడా ఆ వేదమే చెప్పకుంటే యీ పాతివ్వలు లేకపోవును కాదూ!......వేదాలూ, శాస్త్రాలూ మీకే వుండాలి. ఉద్యోగాలు కూడా మీరే కొట్టెయ్యాలి. కదూ?"

"....................."

"....................."

"ఇక యీవృత్తరం—"

"ఆముదం అన్నమాట. ఒకటో నెంబరు అంబాజీపేట సరుకు. పేగులు మహాబాగా శుద్ధి చేస్తుంది. చేసేసింది కూడానూ"

"వుండుమీద కారం చల్లుతున్నారు"

"చీము పట్టకుండా తొరగా మానిపోతుంది, నయమే కాదూ?"

"....................."

"వెళ్లవయ్యా వెర్రిబ్రాహ్మడా! తెల్లబోయి నుంచుంటే పన్లు అవుతాయిటయ్యా యీరోజుల్లోనూ?"

"ఆపని చెయ్యక తప్పదంటారా?"

"తప్పకేం? నిర్బంధమా యేమిటి? మా నెయ్యుడమే నాసలహా. అదే మహా వుత్తమమైన పని. అయితే: దానికి ముందు......వుద్యోగవాంఛ వుందే, దానమ్మకడుపు కాల, అది చేస్తూ వుంది యిదంతానూ. కనక యెలాగేనా అది కాస్తా వదిలించుకోగలిగితే రా యిక వేశ్యాదర్శనమూ అక్కర లేదు, చివరికి దేవతాదర్శనం కూడా అవసరం లేదు. నిశ్చింతగా కూచుని, జంధ్యాలు మెలివేసుకుంటూ వేదాలూ, శాస్త్రాలూ—మరి దయచెయ్యండి"

"....................."

౪

"ఎవరు మీరు?"

"మేం బ్రాహ్మలం"

"దండాలు, ఏం పనిమీద దయచేశారూ?"

"శ్రీకృష్ణార్పణం,......పెద్దపనిమీదే వచ్చాను"

"మేళం కావాలా?"

"నాకంత తాహతూ లేదు, ప్రస్తుతం అవసరమూ లేదూ,........బహుకుటుంబీకుణ్ణి. రెక్కలే ఆధారం, అన్నం పెడతా వని వచ్చాను"

"అలా కుర్చీలో దయచెయ్యండి......"

"....................."

"............ తమవంటివారిని సత్కరించడానికి తాహతు లేదు. పైగా యోగ్యత కూడా లేదు. అయినా "పత్రం, పుష్పం, ఫలం, తోయం—" శ్రీకృష్ణులవారు సెల విచ్చారు కాదూ?........ఆశీర్వదించండి"

"నాలుగు రూపాయలు చేతిలో పెట్టె శక్తి లేదనీ, యోగ్యత లేదనీ—"

"వొక్క నెల గ్రాసమేనా యివ్వలేకపోయాను, సిగ్గుగా వుంది"

"అమ్మా! విన్నాను నీయోగ్యత. విన్నదానికి నిదర్శనం కనపడుతోంది......కాని......నువ్వు వొక్క సంగతి కొంచెం ఆలోచించాలి. నేను నీదగ్గిరికి డబ్బు కోసం రాలేదు. కనక యివి నీదగ్గిర వుంచు"

"......మీదగ్గిరే వుంచండి, మరి నేను వుచ్చుకోను.......ఇక నావల్ల తీరవలసిన ప్రయోజనం యేమిటో చెప్పండి"

"చెప్పమంటావా?"

"సందేహం యెందుకూ?"

"సందేహమే లేదూ, చాలా ఆశపడి వచ్చాను"

"కానివ్వండి చెయ్యతగిందీ, చెయ్యకలదీ అయితే నేను నుంచున్న పాళంగా తయారూ"

"అనుగ్రహం వచ్చిం దంటే నువ్వు మాకందరికీ అన్నంపెట్టగలవు. అంచేతే నిన్ను వెతుక్కుంటూ వచ్చాను"

"ఊహూ"

"వేశ్యావాటికలో అడుగుపెట్టడాని కిదే నాకు మొదలు. నరకం వచ్చినట్టాను; కాని నీయోగ్యత చూడగా సిగ్గుపడవలసిన పని కనబడదు"

"మీ పని చెప్పండి ముందు"

"చేస్తా నని నువ్వు ముందు వాగ్దానం చేస్తేగాని నేను చెప్పలేను"

"అలాంటి వాగ్దానం నే నెప్పుడూ చెయ్యను. వేశ్యల వల్ల నెరవేరే రాచకార్యా లేమీ వుండవు. వున్నా— చెప్పాను కాదూ! నాశక్తినిపట్టీ, ఆపనియొక్క మంచిని పట్టీ నా సాయం వుంటుంది"

"నాకు ఆరుగురు కూతుళ్లు, ఇద్దరు కాపరాలు చేసుకుంటున్నారు. ఇంకా ముగ్గురికి పెళ్ళిళ్లు చెయ్యాలి. ప్రస్తుతం మూడో పిల్లకి కార్యం చెయ్యాలి......ఇదిలా వుండగా, నాకొక్కడే కొడుకు. ఆకొడుకొక్కకూతురు. అది మూడుమాసాల గుడ్డు—"

"పొద్దున్నే చూస్తే పాపాలు పోగొట్టే కుటుంబం అండీ మీది"

"నీకలా తోచడం నాఅదృష్టమే......ఆకొడుకుని కష్టపడి మెటిక్కులేషన్ చదివించాను. యల్టీకూడా అయిపోయాడు. ఉద్యోగం—అంటే యిప్పుడు మేష్టరీ కోసం తిప్పలు పడుతున్నాను"

"..........ఊహూ"

"అది నీశిఫారసువల్ల నెరవేరుతుం దని తెలిసింది... ......మా అమ్మవుకాదూ?......ఈపుణ్యం కట్టుకోవూ?"

"అది యిచ్చేవా రెవరూ?"

"జిల్లాబోర్డు—"

"ఆ!"

"ప్రెసిడెంటుగారు"

"......నేను శిఫారసు చేస్తే యిస్తా రని మీ కెవరు చెప్పారూ?"

"ఎప్పుడూ వారి దగ్గర వుండే గుమాస్తాగారు చెప్పారు"

"శ్రీహరీ.........శ్రీహరీ!"

"ఏమమ్మా?"

".........ఆబుగ్గమీసాల యెలుగ్గొడ్డా మీకిలా చెప్పింది?"

"అవును, ఆబోసినోటివులే"

"....................."

"....................."

".........దేవు డున్నాడా శాస్త్రుల్లుగారూ?"

"అలా అంటా వేమమ్మా?"

"ఇంకే మనాలీ? దేవుడు లేడు, దెయ్యాలు మాత్రం వున్నాయి. ధర్మం లేదు, అధర్మం అంతటా నిండివుంది. మంచి మందులో కేనా లేదు. దౌర్జన్యం ప్రభ వెలిగి పోతోంది. నీతి మాలోనే కాదు, మన దేశంలోనే లేదు. ఎవ రేం చెప్పినా శుద్ధ అబద్ధం తప్ప సత్యం లేదు. ఎక్కడ చూసినా హింస—ఎక్కడ పట్టినా రక్తం —దేవుడు లేనేలేడండీ"

"దేవు డంటే నమ్మకం పోగొట్టే సంఘటన యేమి సంభవించింది తల్లీ నీకూ?"

"........కోప్పడవద్దు... నన్ను నిందించవద్దు. ........బ్రాహ్మల్లో ఛండాలు రున్నా రంటారా లేదా శాస్త్రుల్లుగారూ?"

"లే—ర—ని—చె—ప్ప—లే—ను"

"ఆఛండాలురికి మీరు చెప్పిన ప్రెసిడెంటు కులపెద్ద"

"...................."

"ఏం, కష్టంగా వుందా మీకు?"

"లేదు, లేదు, కాని పాకీవాళ్ల స్వాధీనంలో కూడా కొన్ని పను లున్నాయి"

"నిజమే; కాని పాకీవాళ్ల నేమీ అనకండి మీరు. పాకీపని వాళ్లకి వృత్తి. వృత్తికీ, గుణాలకీ సంబంధం వుంటుందా?"

"వుండదు"

"పాకీవాడు పాకీపని చెయ్యాలి. లేకపోతే అంత కంటే యెక్కువ తాహతు కనపరచాలి"

"అలాగే"

"అయితే, మరి బ్రాహ్మడు?"

"దైవికాంశ కనపరచ్చాలి"

"మీ ప్రెసిడెంటు దగ్గిర ఆదైవికాంశ లవలేశమూ, లేనేలేదు, సరే కదా, రాక్షసుల అంశ పూర్తిగా వుంది"

"కొన్ని అవగుణా లున్నాయని విన్నాను; కాని పర మదుర్మార్గు డని తెలవదు. నీకేం అపకారం చేశాడు పల్లీ ఆయనా?"

"పశువు—కాదుకాదు, పశువే నయం అంతకం టేను........వొక బ్రాహ్మల యింట్లో పెళ్లికి నేను మేళం వెళ్లాను"

"ఊహూ"

"మొగపెళ్లివారికి మీ ప్రెసిడెంటు దగ్గిరి చుట్టం... పెళ్లికి వచ్చాడు........వొక రాత్రి బసకి రమ్మని నాకు కభురు......మీరు చెప్పిన బుగ్గమీసాల యెలుగ్గొడ్డే రాయబారి"

"తెలవక అడుగుతున్నాను. నీకూ ఆయనకీ యిది వరకి సంబంధం లేదూ?"

"కభుర్లు వచ్చాయి, అంగీకరించలేదు. మాపింతల్లి కూతురికీ ఆయనకీ సంబంధం వుంది. దానికీ, నాకూ వున్న అనుబంధాన్ని పట్టి నేను వల్లకా దన్నాను. వొకమాటీసంగతి దానితో చెప్పగా దానిమీద కొంచెం తర్జనభర్జన జరిగింది. ఈగొడవమీదే మరో నాలుగునెల్లకి వాళ్లకి చెడిపోయింది"

"చాలా గొడవ వుందే"

"నేనవరి బసకీ వెళ్లను. మేళం వెళ్లినచోట బ్రహ్మచర్యం ఆచరిస్తాను......వల్లకా దన్నాను"

"సరే"

"నూరురూపాయల కాగితం చూపించాడు. నేను జవాబు చెప్పలేదు"

"...................."

"మన్నాడు మధ్యాహ్నం సభలో నేను గజ్జెకట్టివుండగా విప్పించి మరో సత్రకాయచేత కట్టించాడు. రాత్రి వూరేగింపులో నన్ను గజ్జెకట్టమన్నాడు"

"బోధపడింది. నీమీద పగపట్టా డన్నమాట"

"పాకబు చేశాను. మీ ప్రెసిడెంటుకి రూపతృష్ణ తప్ప మరేమీ లేదు. ఈపుత్ర అంతా యెలుగ్గొడ్డుది"

"మొహర్బానీకోసమా!"

"చాటునా మాటునా గద్దికరవడానికి. తెలిసిందా!"

"...................."

"ఎంత కల్పనో చూశారా! సాధారణంగా మేము డబ్బు తెచ్చినవాడి పల్లా చేరనిస్తాం. అయితే, వాళ్లలో రసికులు నూటికి కోటికో యిద్దరో వుంటారు. తతిమ్మా అంతా—"

"ఎందుకూ! తెలుస్తూనే వుంది కాదూ!"

"నేను శిఫారసు చెయ్యడం అంటే యేమిటో తెలిసిందా మీ కిప్పుడు!"

"తెలిసిం దమ్మా"

"నే నంగీకరిస్తా ననుకోండి. అయితే మీఅబ్బాయి గారికి వుద్యోగం యివ్వడం నిరుకా!"

"గుమాస్తా అలాగే చెప్పాడు"

"అంటే, నాఆత్మద్రోహమూ, ప్రెసిడెంటుపశుత్వమూ కలిసి వొక బ్రాహ్మణకుటుంబానికి భుక్తి యేర్పరుస్తా యన్నమాట"

"....................."

"నేనంగీకరించకపోతే మీపిల్లల నోటిదగ్గిర అన్నం పడగొట్టినదా న్నవుతాను కూడానూ. కదుటండీ!"

"....................."

"కనక శాస్త్రుల్లుగారూ! ఈరాత్రి ప్రెసిడెంటుని తీసుకురమ్మని యెలుగ్గొడ్డుతో చెప్పండి"

"....................."

"వొక్క దమ్మిడీ అయినా పుచ్చుకో దని కూడా చెప్పండి"

"అమ్మా—"

"ఇంకా యేమిటీ?"

"ఏమీ లేదూ. నేను వచ్చినదారినే వెళ్లిపోతాను. నువ్వు ఆత్మద్రోహానికి సిద్ధపడవద్దు"

"ఏం?"

"ఇంతత్యాగా? ఇంత ద్రోహమా? తనెలాగా తార్పుడుకాడే. నన్నుకూడా తనలాగ తయారుచేస్తాడా యీనీచుడూ? నీకూ ప్రెసిడెంటుకీ యిదివరకే సమ్మంధం వుందనీ, నేను నీకే కానో, రెండు కాసులో యివ్వవలసి వస్తుం దనీ సిద్ధపడివచ్చాను. పైగా నువ్వింత యోగ్యురాల వని యెరగనే యెరగను. నేను బ్రాహ్మణ్ణి. వేదం వల్లించాను. యాచన నావృత్తి. మరో నలుగుర్ని చూస్తూవుంటూ నిరమించు. కాని వొక వేశ్యని—కులాంగనలాగ ఆభిజాత్యం కల కళావతిని తార్చడానికి—స్వార్థకోసం వొక భీతహరిణాన్ని పులివాత పడెయ్యడానికి నేను సాహసించలేను. తల్లీ! నన్ను క్షమించు. నాకోరిక మరిచిపో. నాకు సెలవియ్యి........."

"వల్లకాదు. శాస్త్రుల్లుగారూ! కూచోండి...... నేనా పని చేసితీరాలి. నామూలంగా వొక బ్రాహ్మణ కుటుంబానికి జీవనాధారం యేర్పడడం నాఅదృష్టం. నాజీవితంలో యిది వొక పవిత్రమైన సంఘటన. నేనెలాగా మగనాలిని కాను. పతివ్రత నంతకంటే కాను. కనక నేను పతితురాల నైపోను. నాకు విచారం లేదు. మీరూ విచారించకండి"

"తల్లీ—"

"ఇక నేను వినను. మీ రేమీ చెప్పవద్దు. ఇది యిలా జరిగితీరవలసిందే. చెప్పాను కానూ? పశువులతో సాహచర్యం మాకు పరిపాటే. శాస్త్రుల్లుగారూ! మీరు బెంగపెట్టుకోకండి. ఇందాకా నేను చెప్పిన మాటలు యెలుగ్గొడ్డుతో చెప్పండి"

"నన్ను—"

"ఏమీ చెప్పనివ్వను. మీరు మరోలాగ చేశారంటే మీరు నేర్చుకున్న వేదానికి ద్రోహం చేసినవా రవుతారు"

"నాకంఠాని కురి బిగించావమ్మా"

"మరి వెళ్లండి. ఎప్పు డేనా దర్శనం మాత్రం దయ చేస్తూ వుండండి. అమ్మగారికి నాదండాలు మనవి చెయ్యండి"

"అమ్మా! నోరు కుట్టేశావు. చేతులు కట్టేశావు. కాళ్లకి సంకెళ్లు తగిల్చావు. జీవచ్ఛవాన్ని చేసేశావు. ఏంయోగ్యత తల్లీ నీది! ఏం జన్మ తల్లీ నీది! వేశ్యాకులంలో నువ్వు తప్పపుట్టావమ్మా!"

"మాలో నాలాంటివాళ్లు—నాకల తన్నేవాళ్లు వేలున్నారు; కానిలోకం గుడ్డిదీ.........ఇకంతా అప్రస్తుతప్రశంస. దయచెయ్యండి"

".........ఎన్ని తిప్పలు కల్పించాడూ నాకూ? దేవుడు లేడూ? ఈద్రోహి—ఈఅప్రాచ్యుడు ముందుకు వస్తాడా?........."

౫

"అర్ధ రిచ్చారా నాయనా?"

"ఇవ్వనూ యిచ్చారు, వెంటనే పుచ్చుకోనూ పుచ్చుకున్నారు"

"అయ్యో! అదేం పోయేకాలం?"

"ఏం చెప్పనమ్మా? అంతా బూడిదలో పోసిన పన్నీరయిపోయింది. ఎక్కడ బయలుదేరామో అక్కడే వున్నా మిప్పుడు"

"నడుం విరిగిపోయింది.........ఇలా కూచో...
.....ఏం జరిగింది?"

"విం టే నువ్వు విచారిస్తావు. అంతా మరిచిపో. నాకు వచ్చిన పని చేసి నేనిక కుటుంబపోషణ చేస్తాను. నువ్వు 'రామా కృష్ణా" అంటూ వొక చోట కూచో"

"....................."

"నేను మేష్టరీ చెయ్యను మొర్రో అంటే పోరి నన్ను ట్రెయినింగుకి పంపావు. ఇప్పుడు వుద్యోగంకోసం నానా మూలకూళ్లూ కుడిచావు. చివరికి నీతిగా బతికే ఆశిముత్యానికి కూడా వ్రతభంగం చేశావు. ఏం చేసినా వుద్యోగం లేదు. ఏమంటే—అనడానికే వల్లకాదు"

"ఏం జరిగింది నాయనా?"

"ఏం చెప్ప నమ్మా? రెండు సంవత్సరాలు ఖాళీ పడిన వుద్యోగం, మూడువందలు గడ్డితిని వొక కృష్ణా జిల్లా వాడి కిచ్చాడు. వొక మేష్టరు మూడు నెలలు సెలవు పెట్టగా అది నాకిచ్చాడు"

జీతం—"

"నెలకి పాతికరూపాయలు"

"మూడు మాసాలా?"

"అదేనా దక్కితేనా? వారంరోజులు కాలే దింకా ఆయన సెలవుపెట్టీ, "నాకిప్పుడు సెలవు అక్కర్లే" దంటూ మొన్ననే మళ్లీ పనిలో ప్రవేశించాట్ట"

"మరి నీ కెలా యిచ్చాడూ ప్రెసిడెంటూ?"

"నిన్నరాత్రి నాకు ఆర్డరు రాశాడు. ఇవాళ నేన క్కడ వుండగానే, టపాలో, ఆయన మళ్లీ తన పనిలో చేరినట్టు రిపోర్టు వచ్చింది"

"చివరికి ఫలితం యేమిటి నాయనా?"

"బుర్ర గోక్కుంటూ నేనింటికి రావడం"

"వాడమ్మకడుపు కాలిపోను. బతికి బట్టకడతాడా యీ ప్రెసిడెంటు?"

"బోలెడుసొమ్ము తగులడింది. సత్యేపంలాంటి ఆవు పోయింది. చివరికి నత్తికి చేతులు. సావుకారుదగ్గిర చేర నిమ్మంటే విన్నారా? వుద్యోగం—వుద్యోగం—చేతులారా కొంప ముంచేశారు మీనాన్న"



"ఇల్లా అవుతుం దని నాకేమి తెలుసునూ? అయిన వాళ్లూ, కానివాళ్లూ కూడా వుద్యోగాలు చేస్తూ విరగబడిపోతూవుంటే నాకొడుక్కూడా అలా వుండా లని గంపెడాశ పెట్టుకుని యింగ్లీషు చదివించాను; కాని దైవానుగ్రహం లేదు. నేనేం చెయ్యగలనూ."

"నువ్వింకేమీ చెయ్యనక్కర లేదు. నీశక్తికొద్దీ నన్ను చదివించిచావు. అది నాశుభం కోరే. సందేహం లేదు; కాని వుద్యోగం నాతత్వానికి సరిపడదంటే విన్నావు కావు......అయిం దేదో అయిపోయింది. నీతరం వేరూ, నాతరం వేరూనూ. మీకాలపువాళ్ల ఆశలూ, అవసరాలూ వేరూ, మాకాలపువాళ్ల ఆశలూ, అవసరాలూ వేరూనూ. ఇది మీకు తెలవదు. చెబితే బోధపడదు. మీతప్పల్లా యిదే"

"అయితే నువ్విప్పు డేం చేస్తా నంటావు నాయనా?"

"అమ్మా! కాలం మారింది. దృక్పథాలు మారిపోయాయి. వృత్తికి గౌరవం చూపే రోజు లివి. నలుగురికీ వుపకరించీ వస్నే మంచి వృత్తులే. మంచీ చెడ్డా నడకలో వుంది కాని వృత్తిలో యేమీ లేదు"

"తెలిసిగించి చెబుదూ నలిపి చంపకా"

"చెప్పడకు నాన్నా!"

"మతిపోయి యేడుస్తూ వుంటే వుపన్యాసం పేలగొడతా వేమిటి మరీ?"

"అయితే విను. నేనిక కాఫీహోటలూ, భోజనం హోటలూ పెడతాను"

"అయ్యో!"

"వోరి నీమొహం మండా......"

"తిట్టకండి"

"అమ్మా నువ్వూరుకో. తిట్టనియ్యి. నాన్నా! మన పూర్వు లెప్పుడేనా నౌకరి చేశారా? మనవంశాని కది మంచిదేనా? ఇంగ్లీషు మనకి కులవిద్యేనా?"

"అయితే!"

"వుద్యోగా లంటే గౌరవం వుండీ రోజుల్లోనూ, అవి దొరికే రోజుల్లోనూ నా కింగ్లీషు మొదలుపెట్టించావు. నేను తయారయ్యేటప్పటికి గ్రహాలు వక్రించాయి"

"నీది దరిద్రజాతకం. అంచేతే నాకష్టమంతా బుగ్గయిపోయింది"

"ఎప్పుడూ శాపాలే మీకూ. ఇవ్వా డేనా వూరుకోండి"

"నువ్వు నోరు మూసుకో, మనవాడు పూటకూటిల్లు పెడతానంటే చంకలెగరేసుకోమంటావూ!"

"నావుద్యోగం కోసం నువ్వు చేసిన పనులు అంతకంటే మంచివా నాన్నా!"

"ఛీ, అప్రాచ్యుడా!"

"నువ్వు తిడతా వని మొరుగుతును; కాని అది తప్ప నేను మరోటి చెయ్యాను"

"ఈపూరే అన్నమాటేమిటి నాయనా? మరో ప్రెసిడెంటు లేదూ లోకంలోనూ? పూటకూటిళ్లేమిట్రా నలుగురూ నవ్వడానికీ!"

"అమ్మా! నీకసలే తెలవదూ ప్రపంచకం. మీకేమి చెప్పీ వొప్పించడం కష్టం అయినా విను. తెనుగువాడికి యిల్లు కదిలితే తన దేశంలోనే తెనుగుభోజనం దొరకడం లేదు. "అయ్యో! నాతత్వానికి సరిపడ్డ భోజనం దొరకడం లే" దని విచారం కూడా లేదు. అక్కడక్కడ మనవాళ్లు కొందరు హోటళ్లు నడుపుతున్నారు; గాని వాళ్లలో చాలామందికి వ్యవహారజ్ఞానం లేదు. వచ్చేవాళ్లకి అభిమానముగూడా తక్కువే. అంచేత నేను కొత్తపద్ధతులతో హోటలు పెడతాను. కాఫీహోటలుకూడా వుంటే బాగా కిటుతుంది. దేశదేశాలవాళ్లు మన దేశం వచ్చి కాఫీహోటళ్లూ, భోజనహోటళ్లూ పెట్టి లక్షాధికారు లవుతూ వుండగా మన తెనుగుకుర్రాళ్లు దూరం యోచించలేక దిక్కుమాలిన నౌకరీలకోసం మొగబాకుతున్నారు. పైగా ఆవిజాతీయ పదార్థాలు తినడంవల్ల తెనుగురక్తం చప్పబడిపోతోంది కూడాను"

"దేశం యెలా పోతే నీకేమిరా?"

"అయితే యేవృత్తయితే యేనమ్మా?"

---

# గద్వాల పెదసోమభూపాలుడు

క్రీ. శ. ౧౬౬౩ – ౧౭౧౨

మారేమండ రామారావుగారు ఎం, ఏ, బి, ఇడి

గద్వాలసంసంస్థానము ప్రకృతాంధ్రసంస్థానములలో నెల్ల నగ్రగణ్యమై, యనేకశతాబ్దములనుండియు విద్యాపోషణమునకును వితరణవైభవములకును ఖ్యాతిగాంచి నేడు నైజాంరాజ్యాంతర్గతమై యున్నది. క్రీ. శ. ౧౨౯౦ లో కాకతీయప్రతాపరుద్రదేవచక్రవర్తి యీసంస్థానీకుల మూలపురుషునికి కృష్ణాతుంగభద్రానదులమధ్యనున్న కొన్నిసీమలపై నాడగౌడగియను నధికారము నొసంగెను. తరువాతివారు విజనాడగౌడులను పేరుతో క్రీ. శ. ౧౬౬౩ వరకు నాయధికారమును నెరపుచుండిరి. పిమ్మట పెదసోమభూపాలుడు బాహుబలమున ననేకసీమలను జయించి యొకస్వతంత్ర్యరాజ్యము నేర్పరచి, గద్వాలదుర్గమును నిర్మించి యారాజ్యమునకు కేంద్రముగ జేసెను. ఇదియే నేటి గద్వాలసంస్థానము.

సోమభూపాలుడు మహాశూరుడై యనేకాద్భుతకార్యముల నొనర్చెను. అతనిసాహసకార్యములు నేటికిని జనశ్రుతిలో జీవించియున్నవి. నైజాంరాజ్యమునను కర్నూలుప్రాంతమునను తందానపదముల బాడువా రతని చరిత్రమును "శోభనాద్రికథ" యను పాటగా పాడుచున్నారు. ఇట్టి ప్రఖ్యాతవీరపురుషుడగుటవలననే యాతని జన్మమునుగూర్చి యెన్నియో గాథలు కల్పింపబడినవి. ఇతడొక సామాన్యకర్షకుని పుత్రుడనియు, దండ్రి దైవోపహతుడై యాస్తిని గోలుపోయి దేశాటనము జేయుచు మరణించెననియు, నట్టకేల కీబాలుడు పూమారుచేరి యచట నైజనాడగౌడుగనుండిన బక్కమ్మ యను నామె యనుగ్రహమును బడసి యామెచే దత్తుచేసికొనబడెననియు నొకకథలో నున్నది. స్థానిక చరిత్రములలోని గద్వాలకైఫీయతులో నైజనాడగౌడులలోని యొకశాఖకు జెందిన కుటుంబములో బుట్టిన సోమన్న యను బాలుని పైని చెప్పిన బక్కమ్మ పెంచుకొనెనని చెప్పబడియున్నది. ఇందుకు విరుద్ధముగ నీసోమభూపాలుని మనుమని కాలమున రచింపబడిన యథాశ్లోకరామాయణాదిగ్రంథములలో నితడు పెద్దరెడ్డి యను విజనాడగౌడుకును బక్కాంబకును బుత్రుడని వర్ణింపబడినాడు. ఇదియే వాస్తవమును విశ్వసనీయమును నని తోచుచున్నది. ఈపెద్దారెడ్డి పూమారుదుర్గమున అపుత్రకు డగు మామ యింటనే యుండి